సాక్షి
వికారాబాద్

సోమవారం, 4, సెప్టెంబర్, 2023



ఆదివారం అవస్థలే

వికారాబాద్‌లో ఆదివారం నిర్వహించే అంగడిలో సౌకర్యాలు లేక వ్యాపారులు, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. 8లో▸



బస్సులు కరువు

కొడంగల్ పరిధిలోని కోస్గి ఆర్టీసీ డిపోలో బస్సులు కరువయ్యాయి. కాలంచెల్లిన వాహనాలతోనే నెట్టుకొస్తున్నారు. 8లో▸



దిగుబడి తగ్గి.. ధర పెరిగి

మినుము, పెసర పంటలకు మార్కెట్లో రికార్డు ధర పలుకుతోంది. గతంతో పోలిస్తే ఈసారి ధర బాగా పెరిగింది. 9లో▸

న్యూస్‌రీల్

బీఆర్‌ఎస్‌తోనే అభివృద్ధి

ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి



ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరిన నాయకులు

పరిగి: బీఆర్‌ఎస్ పార్టీతోనే అభివృద్ధి సాధ్యమని ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని సుల్తాన్‌పూర్ తండాకు చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆదివారం ఎమ్మెల్యే నివాసంలో బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. కుల్కచర్ల మండల పరిధిలోని ఇప్పాయిపల్లి గ్రామ సర్పంచ్ అనురాధ, వార్డు మెంబర్లు, పుట్టపహాడ్ గ్రామ సర్పంచ్ అంజి లమ్మ వారి అనుచరులు బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలు నచ్చి ఎంతోమంది బీఆర్‌ఎస్‌లో చేరుతున్నారన్నారన్నారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా మన రాష్ట్రంలో సంక్షేమ పథకాలు అమలు అవుతున్నాయన్నారు. పార్టీ కోసం కష్టపడే నాయకులకు తగిన గుర్తింపు ఇస్తామన్నారు. సుల్తాన్‌పూర్ ఎంపీటీసీ వెంకట్‌రెడ్డి, ఆయా గ్రామాల సర్పంచ్‌లు తదితరులు పాల్గొన్నారు.

సరిహద్దులో 8 చెక్‌పోస్టులు

డీఎస్పీ శేఖర్‌గౌడ్



పోలీసు అధికారులతో మాట్లాడుతున్న డీఎస్పీ శేఖర్‌గౌడ్

తాండూరు: రానున్న అసెంబ్లీ ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని తెలంగాణ–కర్ణాటక అంతర్రాష్ట్ర సరిహద్దులో పటిష్టమైన భద్రత ఏర్పాటు చేస్తున్నామని తాండూరు డీఎస్పీ శేఖర్‌గౌడ్ అన్నారు. ఆదివారం తాండూరు సబ్ డివిజన్ కార్యాలయంలో కర్ణాటక సరిహద్దులో ఉన్న చించోళి సబ్ డివిజన్ పరిధిలోని పోలీసు అధికారులు, తాండూరు సబ్ డివిజన్ పోలీసు అధికారుల సమీక్షా సమావేశం జరిగింది. తెలంగాణలో త్వరలో జరగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో సరిహద్దు ప్రాంతాల మధ్య చేపట్టనున్న భద్రతా చర్యలపై చించోళి డీఎస్పీ బస్వరాజ్‌తో కలిసి తాండూర్ డీఎస్పీ శేఖర్‌గౌడ్ చర్చించారు. ఇటీవల కర్ణాటక రాష్ట్రంలో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో సరిహద్దు ప్రాంతంలో ఎలాంటి భద్రతా చర్యలు చేపట్టారో చించోళి డీఎస్పీని అడిగి తెలుసుకున్నారు. అక్రమ రవాణా అరికట్టేందుకు సరిహద్దులో చెక్‌పోస్టులు ఏర్పాటు చేయాలని డీఎస్పీ శేఖర్‌గౌడ్ చించోళి డీఎస్పీ బస్వరాజ్‌ను కోరారు. మద్యం అక్రమ రవాణాను అరికట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో తాండూరు పట్టణ సీఐ రాజేందర్‌రెడ్డి, రూరల్ సీఐ రాంబాబు, ఇరురాష్ట్రాలకు చెందిన పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

తుప్పుపడుతున్నాయి

- మూలనపడ్డ ఎలక్ట్రిక్ వాహనాలు
- చెత్త సేకరణకు ఇబ్బంది



మున్సిపల్ కార్యాలయంలో వృథాగా ఎలక్ట్రిక్ వాహనాలు

వికారాబాద్ అర్బన్: మున్సిపాలిటీలపై ఇంధన భారం తగ్గించాలనే ఉద్దేశంతో కొనుగోలు చేసిన.. చెత్తసేకరణ ఆటోలు ఇప్పుడు పెట్టిన చోటనే తుప్పుపట్టి పోతున్నాయి. దీంతో నిధులు ఆదాచేయాలనే లక్ష్యం నీరు గారిపోతుంది. వికారాబాద్ మున్సిపాలిటీలో చెత్త సేకరణకు ప్రతి నెల సుమారు రూ.4,35,000 వరకు ఖర్చు చేస్తున్నారు. 2021లో ఈ ఖర్చు రూ.3,20,000 వరకు ఉండేది. ఆ సమయంలో ఉన్న డీజిల్ ఖర్చును తగ్గించుకోవాలనే ఉద్దేశంతో మున్సిపల్ బడ్జెట్ నుండి రూ.32 లక్షలు ఖర్చుచేసి 15 ఎలక్ట్రిక్ ఆటోలు కొనుగోలు చేశారు. ఇతంవరకు బాగానే ఉన్నా వాటి నిర్వాహణ సాధ్యం కాలేదు. ఏడాది గడవక ముందే 15 ఎలక్ట్రిక్ వాహనాలను మూలన పడేశారు. చిన్నచిన్న మరమ్మతులు వచ్చినా వాటిని బాగు చేయించలేదు. అప్పటి శానిటేషన్ ఏఈ, జవాన్లు కలిసి ఉద్దేశపూర్వకంగానే ఎలక్ట్రిక్ వాహనాలను బాగు చేయించలేదనే ఆరోపణలు ఉన్నాయి. ఇంధనంతో నడిచే వాహనాలు ఉపయోగంలో ఉంటే డీజిల్ కమీషన్లు, మరమ్మతు కమీషన్లు వస్తాయనే ఉద్దేశంతో వాటిని మూలన పడేశారనే ఆరోపణలు ఉన్నాయి. ఏదిఏమైనా గత ఏడాది కాలంగా 15 ఎలక్ట్రిక్ వాహనాలు నిరుపయోగంగా ఉంచడంతో ఉన్నచోటనే తుప్పుపట్టి పోతున్నాయి. అధికారులు ఎలక్ట్రిక్ వాహనాలను ఉపయోగంలోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.



ప్రాజెక్టు చూసేందుకు వచ్చిన పర్యాటకులు

నో ఎంట్రీ..

కోట్‌పల్లి ప్రాజెక్టుతో పాటు అక్కడి జలపాతం వద్ద సేదతీరేందుకు ఆదివారం పర్యాటకులు వందలాదిగా తరలివచ్చారు. అయితే ప్రాజెక్టు వద్దకు పర్యాటకులెవరూ వెళ్లకుండా దారులన్నీ మూసివేయడంతో పాటు పోలీసు, ఫారెస్టు సిబ్బంది కాపలాగా ఉండటంతో చేసేదిలేక ఉసూరుమంటూ వెనుదిరిగారు. సరైన కారణాలు చెప్పకుండా వెనక్కిపంపించడం ఏమిటని వారు ఆగ్రహం వ్యక్తంచేశారు.

– ధారూరు



ప్రాజెక్టు వద్దకు అనుమతించకపోవడంతో నిరాశగా వెనుదిరుగుతూ..

పక్కాగా.. సాగు లెక్క

- పంటల వివరాల సేకరణకు ప్రత్యేక యాప్
- క్షేత్రస్థాయిలో పరిశీలించి నమోదు చేస్తున్న అధికారులు
- జిల్లాలో ఇప్పటివరకు 5,55,852 ఎకరాల్లో సాగు



కస్తూర్‌పల్లిలో సాగు వివరాలను యాప్‌లో నమోదు చేస్తున్న అధికారులు (ఫైల్)

కొడంగల్ రూరల్: ప్రభుత్వం అందించే రాయితీలు, ఇతర ప్రయోజనాలతో పాటు పంట నష్టపరిహారం పొందేందుకు రైతులు.. అధికారుల దగ్గర సాగువివరాలను తప్పక నమోదు చేసుకోవాలని వ్యవసాయాధికారులు పేర్కొంటున్నారు. ఇందుకోసం రాష్ట్ర వ్యవసాయశాఖ ప్రత్యేక యాప్‌ను రూపొందించి పంటల నమోదు ప్రక్రియకు శ్రీకారం చుట్టింది. క్షేత్రస్థాయిలో వ్యవసాయాధికారులు సాగు వివరాల నమోదు చేపడితేనే ఈ యాప్‌లో వివరాలు సెండ్ చేసేలా ఈ యాప్‌ను రూపొందించారు. దీంతో వ్యవసాయాధికారులు, సిబ్బంది క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ పొలాల దగ్గరకు వెళ్లి రైతులు సాగుచేసిన పంటల వివరాలు, సాగు విస్తీర్ణం తదితర వివరాలను యాప్‌లో నమోదు చేస్తున్నారు. ఏ పంటలు ఎప్పుడు వేయాలి, ఏ మందులు వాడాలి వంటి వాటిపైనా రైతులకు అవగాహన కల్పిస్తున్నారు.

సాగు వివరాలు..

వికారాబాద్ జిల్లాలో వానాకాలం–2023 ఏడాదికి సంబంధించి ఇప్పటివరకు సాగైన పంటల వివరాలు.. వరి 1,19,253 ఎకరాలు, పత్తి 2,46,846 ఎకరాలు, మొక్కజొన్న 45,203 ఎకరాలు, జొన్న 1,923 ఎకరాలు, కంది 1,17,734 ఎకరాలు, పెసర 13,154 ఎకరాలు, మినుము 5,964 ఎకరాలు, సోయా 2,288 ఎకరాలు, ఇతర పంటలు 3,487 ఎకరాల్లో సాగుచేయగా మొత్తంగా 5,55,852 ఎకరాల్లో పంటలు సాగయ్యాయి.

నమోదుచేయించుకోని పక్షంలో..

రైతులు పంటలు నమోదు చేయించుకోని పక్షంలో ధాన్యం అమ్మకంలో ఇబ్బందులకు గురయ్యే అవకాశం ఉంటుందని వ్యవసాయాధికారులు పేర్కొంటున్నారు. ప్రత్యామ్నాయ ఏర్పాట్లలో భాగంగా ఇతర రైతుల పేరిట ధాన్యాన్ని విక్రయించాల్సి వస్తోంది. సదరు రైతు బ్యాంకులో రుణం పొంది ఉంటే బ్యాంకులు పంట రాబడి నగదును జమ చేసుకుంటున్నాయి. రైతులు ఎలాంటి ఇబ్బందులకు గురికాకుండా ఉండాలనే ఉద్దేశ్యంతో యాప్ ద్వారా నమోదు కార్యక్రమాన్ని చేపట్టినట్లు అధికారులు పేర్కొంటున్నారు. గ్రామాలవారీగా రైతులు, కౌలు రైతుల పేర్లు, సర్వే నంబర్, సాగు విస్తీర్ణం, ఏ పంట సాగు చేశారు, నీటి వసతి తదితర వివరాలన్నీ నమోదు చేయడంతో సాగు వివరాలు తెలిసేందుకు అవకాశం ఉంటుందని తెలుపుతున్నారు. క్షేత్రస్థాయిలో అధికారులు పంటలను పరిశీలించడంతో రైతులకు సలహాలు, సూచనలు అందించే అవకాశం ఉంది.

రైతులకు ప్రయోజనం



సాగు వివరాలను యాప్‌లో నమోదు చేయడం ద్వారా పంట దిగుబడిలో ధాన్యాన్ని అమ్మకానికి తీసుకెళ్లే సమయంలో రైతులు ఎలాంటి ఇబ్బందులు ఉండవు. అధికారులు క్షేత్రస్థాయిలో పంటలను నమోదు చేసే సమయంలో పొలాల్లో చీడపీడల బెడద, పంట ఎదుగుదలకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రైతులకు అవగాహన కల్పించే అవకాశం ఉంటుంది. దీంతో రైతులకు మేలు జరుగుతుంది. రైతులు అధికారుల సలహాలు, సూచనలు పాటించి అధిక దిగుబడి పొందాలి.

– గోపాల్, జిల్లా వ్యవసాయాధికారి

ఓటరుగా నమోదు చేసుకోండి

కలెక్టర్ నారాయణరెడ్డి

పూడూరు: 18 యేండ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని కలెక్టర్ సి.నారాయణరెడ్డి సూచించారు. ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమంలో భాగంగా ఆదివారం మండల పరిధిలోని మన్నేగూడ, పూడూరు పోలింగ్ కేంద్రాలను కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఓటుహక్కును ఆన్‌లైన్‌లో (లేక) ఫారం–6ను నింపి బీఎల్‌ఓలను సంప్రదించినా సరిపోతుందని తెలిపారు. అధికారులు తప్పనిసరిగా ఓటు హక్కు ప్రాముఖ్యతను వివరించి జిల్లాలో పోలింగ్ శాతాన్ని పెంచాలని కోరారు. బీఎల్‌ఓలు ఇంటింటికి వెళ్లి ఇప్పటివరకు ఓటరుగా నమోదు కాని యువతీయువకులను గుర్తించాలని సూచించారు. సెప్టెంబర్ 19వరకు అవకాశం ఉందని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో వికారాబాద్ ఆర్డీఓ విజయకుమారి, తహసీల్దార్ రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల తనిఖీ..

కొడంగల్: కొడంగల్ మున్సిపల్ పరిధిలోని పలు పోలింగ్ కేంద్రాలను జిల్లా అదనపు కలెక్టర్, కొడంగల్ అసెంబ్లీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి లింగ్యానాయక్ ఆదివారం పరిశీలించారు. త్వరలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో పోలింగ్ కేంద్రాలను ఆయన తనిఖీ చేశారు. పోలింగ్ కేంద్రాల్లో సౌకర్యాలను పరిశీలించారు. నియోజకవర్గంలోని అన్ని పోలింగ్ కేంద్రాలను పరిశీలించి ఓటర్లకు ఇబ్బంది లేకుండా తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. నియోజకవర్గంలోని కొడంగల్, దౌల్తాబాద్, బొంరాస్‌పేట, దుద్యాల, కోస్గి, గుండుమాల్, మద్దూరు, కొత్తపల్లి మండలాల్లో 275 పోలింగ్ కేంద్రాలు ఉన్నట్లు చెప్పారు. కొడంగల్ మండలంలో 41 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. అక్టోబర్ ఒకటో తేది నాటికి జిల్లాలో 18 ఏళ్లు నిండే వారు ఓటరుగా నమోదు చేసుకోవాలని సూచించారు. తహసీల్దార్ విజయకుమార్, బూత్‌లెవల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



పూడూరులో ఓటరు సిబ్బందికి సూచనలు చేస్తున్న కలెక్టర్ నారాయణరెడ్డి

రాష్ట్రంలో అరాచక పాలన



టీఆర్‌ఆర్ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన నాయకులు

డీసీసీ అధ్యక్షుడు రామ్మోహన్‌రెడ్డి

పరిగి: బీఆర్‌ఎస్ అరాచక పాలనను అరికట్టాలంటే రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఎంతో అవసరమని డీసీసీ అధ్యక్షుడు డాక్టర్ టి.రామ్మోహన్‌రెడ్డి అన్నారు. పూడూర్ మండల పరిధిలోని తిరుమలాపూర్, రాకంచర్ల గ్రామాలకు చెందిన బీఆర్‌ఎస్, బీజేపీ నాయకులు టీఆర్‌ఆర్ నివాసంలో ఆదివారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా టీఆర్‌ఆర్ మాట్లాడుతూ.. కేంద్రంలో బీజేపీని, రాష్ట్రంలో బీఆర్‌ఎస్ పార్టీని ప్రజలెవరూ నమ్మే పరిస్థితిలో లేరన్నారు. కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణలో కుటుంబపాలన కొనసాగుతోందన్నారు. ప్రజాధనం వృథా చేస్తూ ప్రజలను అప్పులపాలు చేస్తున్నాన్నారు. ఉద్యోగాలు రాక ఎంతోమంది నిరుద్యోగులు రోడ్లపై తిరుగుతున్నారని తెలిపారు. అర్హులందరికీ సంక్షేమ పథకాలు లభించాలంటే కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావాలని.. ఆ దిశగా కార్యకర్తలు పనిచేయాలన్నారు. ఆ పార్టీ సీనియర్ నాయకుడు పెంటయ్య, కార్యకర్తలు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయాలి

బూత్‌స్థాయి నుంచి కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయాలని డీసీసీ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే టి.రామ్మోహన్‌రెడ్డి అన్నారు. పట్టణ కేంద్రంలోని ఆయన నివాసంలో ఆదివారం నియోజకవర్గంలోని ఆ పార్టీ మండల అధ్యక్షులు, నాయకులతో టీఆర్‌ఆర్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ ఓటుహక్కు కోసం దరఖాస్తు చేసుకునేలా నేతలు అవగాహన కల్పించాలన్నారు. అందరూ కలసి పని చేస్తేనే అధికారంలోకి వస్తామన్నారు. ఆ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు లాల్‌కృష్ణ, ప్రధాన కార్యదర్శి హన్మంతు, అష్రఫ్, పట్టణ అధ్యక్షుడు కృష్ణ, మండలాల అధ్యక్షులు పరశురాంరెడ్డి, ఆంజనేయులు, విజయ్ కుమార్‌రెడ్డి, సురేందర్, అశోక్‌కుమార్, చిన్ననర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

సమర్థవంతంగా 5ఎస్ వర్టికల్

ఎస్పీ కోటిరెడ్డి

అనంతగిరి: జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్, ఆఫీసుల్లో 5ఎస్ వర్టికల్ సమర్థవంతంగా అమలు చేస్తున్నామని ఎస్పీ కోటిరెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇటీవల రాష్ట్ర వ్యాప్తంగా వచ్చిన వర్టికల్స్ రిపోర్ట్‌ల్లో జిల్లా 5ఎస్ వర్టికల్ మొదటి స్థానంలో ఉందన్నారు. 5ఎస్ వర్టికల్ మానిటరింగ్ అధికారులు తాండూర్ డీఎస్పీ శేఖర్‌గౌడ్, పోలీస్ స్టేషన్‌ల్లో 5ఎస్ అమలుచేసే అధికారులను జిల్లా ఎస్పీ అభినందించారు. పోలీస్ స్టేషన్స్, ఆఫీసుల్లో ఉన్నటువంటి రిసెప్షన్ కేంద్రం, రికార్డ్స్ రూమ్, లాకప్, రెస్ట్ రూమ్స్, ఎస్‌హెచ్‌ఓ రూమ్, రైటర్స్ రూమ్, ఆఫీసుల చుట్టూ ఉన్న పరిసరాలు, ఫిర్యాదుదారుల కోసం ఏర్పాటు చేసిన మంచినీటి సదుపాయం, వారు కూర్చోడానికి ఏర్పాటు చేసిన చైర్లు అన్ని విభాగాల్లో పరిశుభ్రంగా, క్రమపద్ధతిలో పనికిరాని వస్తువులు లేకుండా, ఏ వస్తువు ఎక్కడ ఉండాలో అలా ఉండటం వల్లే వర్టికల్‌లో ప్రగతి సాధించామని తెలిపారు. ప్రతి పోలీస్ స్టేషన్‌లో 5ఎస్ వర్టికల్‌ను మరింత సమర్థవంతంగా నిర్వహించి జిల్లా పోలీస్ డిపార్ట్‌మెంట్‌కు మంచిపేరు తీసుకోరావాలని ఎస్పీ సూచించారు. ప్రజల రక్షణే కర్తవ్యంగా పనిచేయాలని పిలుపునిచ్చారు.

ఉత్తమ సేవకు పురస్కారం

వికారాబాద్ అర్బన్: వికారాబాద్‌కు చెందిన ఎం డీ.యాసీన్‌కు సర్వేపల్లి స్మారక పురస్కారం దక్కింది. పుడమి జాతీయ సంస్థ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా 100 మంది ఉత్తమ ఉపాధ్యాయులను ఎంపిక చేయగా అందులో యాసీన్ ఉన్నారు. ఈ మేరకు ఆదివారం నల్లగొండ జిల్లా కేంద్రంలో జరిగిన వేడుకల్లో ఆయనను సన్మానించి సర్వేపల్లి స్మారక పురస్కారం అందించారు. విశ్వనాథ కవి వారసులు కాపూరి శ్రీనివాస శర్మ, గుడు వెంకట నాగేశ్వరరావు, గిడుగు రామ్మూర్తి వారసుల చేతుల మీదుగా ఈ పురస్కారం అందించారు. గత కొన్ని సంవత్సరాలుగా విద్యారంగంలో విశిష్ట సేవలు అందిస్తున్నందుకు, వినూత్న పద్ధతిలో బోధనకు, నిరుద్యోగులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నందుకు గాను ఈ అవార్డుకు ఎంపిక చేశారు. ప్రస్తుతం యాసీన్ జిల్లా సెక్టోరల్ ఆఫీసర్‌గా విధులు నిర్వహిస్తున్నారు.





అతిథుల చేతులమీదుగా పురస్కారాలు అందుకుంటున్న యాసీన్, జగదీశ్

ఉత్తమ ఉపాధ్యాయుడిగా జగదీశ్..

బషీరాబాద్: మండలంలోని కొల్లాపూర్ గ్రామానికి చెందిన జగదీశ్‌కు పుడమి సాహితీ వేదిక జాతీయ అవార్డు ప్రదానం చేసింది. ఈ మేరకు ఆ సంస్థ ప్రతినిధులు ఆదివారం నల్లగొండలో జరిగిన కార్యక్రమంలో జగదీశ్‌కు అవార్డు అందించారు. జగదీశ్ ఒకవైపు పాఠశాలలో ఉపాధ్యాయుడిగా కొనసాగుతూనే మరోవైపు విద్యార్థులకు మోటివేషన్ క్లాసులు నిర్వహిస్తున్నారు. యూట్యూబ్ ద్వారా నిరుద్యోగులకు ఉచితంగా తరగతులు చెబుతున్నాడు.ఆయన సేవలను గుర్తించిన పుడమి సాహితీ వేదిక సర్వేపల్లి రాధాకృష్ణ జాతీయ ఉత్తమ ఉపాధ్యాయుడి అవార్డును ప్రదానం చేసింది. జగదీశ్‌ను తోటి ఉపాధ్యాయులు అభినందించారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాస్ శర్మ, యాదాద్రి అసిస్టెంట్ పోలీస్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కుండపోత

- జిల్లావ్యాప్తంగా దంచికొట్టిన వాన
- ఈ సీజన్‌లో రెండో అత్యధిక వర్షపాతం నమోదు
- పొంగిపొర్లిన వాగులు, వంకలు



ధారూరు: పత్తిచేనులో నిలిచిన వర్షపు నీరు



రుద్రారం–నాగసమందర్ మధ్య తాత్కాలిక వంతెన పైనుంచి పారుతున్న అలుగు

వికారాబాద్: నెలరోజులకు పైగా మొహం చాటేసి రైతులకు కంటి మీద కునుకు లేకుండా చేసిన వరుణుడు ఎట్టకేలకు కరుణించాడు. కరుణించటమే కాదు ఒక్కసారిగా విజృంభించాడు. 12 గంటల వ్యవధిలో జిల్లావ్యాప్తంగా భారీ వర్షాలు కురిశాయి. శనివారం సాయంత్రం నుంచి ఆదివారం ఉదయం వరకు జిల్లాలో కుండపోత వర్షం కురిసింది. వాగులు వంకలు పొంగిపొర్లాయి. జిల్లాలో ఉన్న ప్రధాన ప్రాజెక్టులన్నీ గతరాత్రి వర్షానికి మళ్లీ పూర్తిస్థాయి నీటిమట్టంతో అలుగు పారుతున్నాయి.

కోట్‌పల్లిలో అత్యధికంగా..

గడిచిన 12గంటల్లో జిల్లావ్యాప్తంగా అన్ని మండలాల్లో సగటున 54.3 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు కాగా కోట్‌పల్లిలో అత్యధికంగా 108.9మి.మీ, బంట్వారంలో 99 మి.మీ, దౌల్తాబాద్, ధారూర్‌లో 81మి.మీ, వికారాబాద్‌లో 70 మి.మీ వర్షపాతం నమోదయ్యింది. జిల్లాలోని ప్రధాన ప్రాజెక్టులైన శివసాగర్, నందివాగు, జుంటుపల్లి, కోట్‌పల్లి, లఖ్నాపూర్, సర్పన్‌పల్లి తదితర ప్రాజెక్టులు పూర్తిస్థాయి నీటిమట్టాన్ని సంతరించుకుని అలుగు పారుతున్నాయి. మొత్తం జిల్లాలో 1179 చెరువులు, కుంటలు, ప్రాజెక్టులు ఉండగా ఇందులో 700కు పైగా చెరువులు అలుగు పారుతున్నాయి.

ఆనందంలో రైతులు...

వానాకాలం అయినప్పటికీ నెలరోజులకు పైగా వరుణుడు మొహం చాటేశాడు. లోటు వర్షపాతంతో చాలావరకు పంటలు ఎండిపోతున్నాయి. ఇలాంటి తరుణంలో శనివారం అర్ధరాత్రి నుంచి కురిస్తోన్న వర్షంతో రైతుల ముఖాల్లో సంతోషం కన్పిస్తోంది. రానున్న మూడురోజులపాటు భారీనుంచి అతిభారీ వర్షాలు కురుస్తాయని వాతావరణశాఖ వెల్లడించిన నేపథ్యంలో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

క్లుప్తంగా

పర్మినెంట్ చేసే వరకు సమ్మె కొనసాగిస్తాం


ర్యాలీ నిర్వహిస్తున్న మున్సిపల్ కార్మికులు

వికారాబాద్ అర్బన్: మున్సిపాలిటీలో పనిచేస్తున్న ఔట్ సోర్సింగ్, కాంట్రాక్టు ఉద్యోగులను పర్మినెంట్ చేసే వరకు ఆందోళన కొనసాగిస్తామని మున్సిపల్ కార్మికుల సంఘం వికారాబాద్ పట్టణ అధ్యక్షుడు చెన్నయ్య అన్నారు. ఆదివారం కార్మికులు పట్టణంలో పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించారు. గత పదిహేను రోజులుగా శాంతియుతంగా ఆందోళన చేస్తున్నా ప్రభుత్వం స్పందించడం వాపోయారు. ప్రభుత్వం దిగిరాకుంటే ఈ నెల 5న రాష్ట్ర జేఏసీ పిలుపు మేరకు విధులు బహిష్కరించి సమ్మె చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కార్మిక సంఘం నాయకులు మధు, నాగేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వాడిపోతున్న వేప కొమ్మలు


ఎండినపోతున్న వేప కొమ్మలు

మోమిన్‌పేట: వేప చెట్లు మళ్లీ ఎండిపోతున్నాయి. గత మార్చి నెలలో కురిసిన వడగండ్ల వానకు ఎండిన వేప చెట్లు మళ్లీ చిగురించాయి. వడగండ్ల వానతో వైరస్ పోయిందని అందరూ అనుకొన్నారు. కాని, మళ్లీ వేపచెట్లు ఎండుతూనే ఉన్నాయి. ఏళ్ల సంవత్సరాల వయస్సు గల చెట్లు ఎండిపోతున్నాయి. వచ్చిన చిగురు వచ్చినట్లుగానే ఎండుతుంది. ఇలాగే కొనసాగితే చల్లని నీడ, ప్రాణవాయువు కష్టమవుతోందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

ఎస్‌ఐ శ్రీధర్‌రెడికి సన్మానం


ఎస్‌ఐ శ్రీధర్‌రెడ్డిని సన్మానిస్తున్న కాంగ్రెస్ నాయకులు

మర్పల్లి: మర్పల్లి ఎస్‌ఐగా బాధ్యతలు చేపట్టిన ఎస్‌ఐ శ్రీధర్‌రెడ్డిని ఆదివారం మండలానికి చెందిన కాంగ్రెస్, బీజేపీ నాయకులు మర్యాదపూర్వకంగా వేర్వేరుగా కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా స్థానిక కాంగ్రెస్, బీజేపీ నాయకులు పరిచయాలు చేసుకున్నారు. ఎస్‌ఐకు సన్మానం చేసిన వారిలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు రవీందర్,, ఉపాధ్యక్షుడు సలీం, వర్కింగ్ ప్రెసిడెంట్ సురేష్, రాచన్న బీసీ సెల్ మండల నాయకుడు గూడెంమల్లేశ్ యాదవ్, మర్పల్లి జీపీ వార్డు మెంబర్ సర్వేశ్, మండల యువజన సంఘం నాయకులు లడ్డు ఉన్నారు. అలాగే బీజేపీ మండల పార్టీ అధ్యక్షుడు మల్లేశ్‌యాదవ్, జిల్లా నాయకులు రామేశ్వర్‌రెడ్డి, పంతులుబాయి శ్రీనివాస్, మండల కార్యదర్శి శ్రీధర్‌రెడ్డి, బీసీ మోర్చా మండల అధ్యక్షుడు సీహెచ్ మధుకర్ ఉన్నారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

షాబాద్: రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందాడు. షాబాద్ సీఐ యాదయ్యగౌడ్ తెలిపిన ప్రకారం.. మండలంలోని సంకెపల్లిగూడకు చెందిన కద్మూరి అరవింద్‌గౌడ్ ఆగస్టు 27న బైక్‌పై వెళ్తుండగా గ్రామ సమీపంలో ఎదురుగా వస్తున్న బైక్ ఢీకొట్టింది. దీంతో క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం నగరంలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతున్న ఆయన పరిస్థితి విషమించి శనివారం రాత్రి మృతి చెందాడు. కేసు దర్యాప్తులో ఉంది. కాగా ఆదివారం జెడ్పీటీసీ సభ్యుడు పట్నం అవినాశ్‌రెడ్డి మృతదేహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. అనంతరం మృతుడి కుటుంబ సభ్యులను ఓదార్చారు. జెడ్పీటీసీ వెంట కార్పొరేషన్ మాజీ చైర్మన్ నాగేందర్‌గౌడ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ నక్క శ్రీనివాస్‌గౌడ్, సర్పంచ్ దర్శన్ తదితరులున్నారు.

ఉధృతంగా కోట్‌పల్లి ప్రాజెక్టు అలుగు

నిలిచిపోయిన రాకపోకలు
- ప్రయాణికులు, వాహనదారుల ఇక్కట్లు


ధారూరు: కోట్‌పల్లి ప్రాజెక్టు అలుగుపై నుంచి ఉధృతంగా ప్రవహిస్తున్న వరద

ధారూరు: వర్షం దంచికొట్టింది.. శనివారం రాత్రి నుంచి ఆదివారం ఉదయం వరకు ఏకధాటిగా కురిసిన వర్షానికి కోట్‌పల్లి ప్రాజెక్టు అలుగుపై నుంచి వరదనీరు ఉధృతంగా ప్రవహించింది. ఎగువన కురిసిన భారీవర్షాలకు వాగులు ప్రవహించి వరద నీరు ఉప్పెనలా ప్రాజెక్టులోకి చేరింది. వచ్చిన నీరు వచ్చినట్లుగా అలుగుపై నుంచి 3 అడుగుల ఎత్తులో వరదనీరు ఉధృతంగా ప్రవహించింది. తాండూర్–ధారూరు వయా నాగసమందర్, పెద్దేముల్ మీదుగా రాకపోకలు పూర్తిగా స్తంభించిపోయాయి. అలాగే బంటారం, కోట్‌పల్లి, మర్పల్లి మండలాలతో పాటు కర్ణాటకలోని కుంచారం వెళ్లడానికి కూడా రాకపోకలు నిలిచిపోయాయి. ధారూరు మండల పరిధిలోని రుద్రారం–నాగసమందర్ గ్రామాల మధ్య రోడ్డుపై కొత్తగా నిర్మించిన వంతెనపై నుంచి అలుగు పారడంతో రాకపోకలకు 8 గంటల పాటు అంతరాయం ఏర్పడింది. భారీ వర్షాలతో అలుగు నుంచి నీరు ఉధృతంగా ప్రవహిస్తే రోజుల తరబడి రాకపోకలు నిలిచిపోతాయని వారు ఆందోళన వ్యక్తం చేశారు. వంతెనపై నుంచి అలుగు ప్రవహిస్తుండడంతో పోలీసులు అప్రమత్తమై బందోబస్తు ఏర్పాటు చేశారు. నీటి ప్రవాహం అధికంగా ఉన్న రోడ్డుపై నుంచి ఎవ్వరు వెళ్లకుండా రెండు వైపుల కంచె వేయించి సిబ్బందిని కాపలా పెట్టారు. అలాగే స్టేషన్‌ధారూరు–దోర్నాల్ గ్రామాల మధ్య ప్రవహిస్తున్న కాగ్నానది వద్ద కూడా కాపలా పెట్టారు.

వర్షం.. హర్షం

బొంరాస్‌పేట: వర్షాల కోసం ఆశగా ఎదురుచూస్తున్న రైతులు మురిశారు. పంటలు పరవశించాయి. బొంరాస్‌పేట, దుద్యాల మండలాల్లో శనివారం రాత్రి ఏడుగంటల నుంచి తొమ్మిది గంటల వరకు ఎడతెరిపి లేకుండా వర్షం కురిసింది. గత రెండు వారాలుగా పత్తి పంటలు వర్షాలు లేక ఎండుముఖం పట్టాయి. కొంతమంది రైతులు దూరం నుంచి వ్యవసాయ బోర్ల నుంచి స్ప్రింకర్లు ఏర్పాటే చేసుకున్నారు. భారీ వాన కురవడంతో రైతులు మురిసిపోయారు. పంటలు కళకళలాడాయి. ఎడతెరిపి లేకుండా 14గంటలపాటు కురిసిన వానకు మహంతీపూర్ సమీపంలోని కాకర్‌వాణి వాగు జోరుగా పారింది. రాకపోకలకు ఇబ్బందిగా మారిన వాగుపై వంతెన నిర్మించాలని సర్పంచు మహిపాల్, గ్రామస్తులు కోరారు.

కరుణించిన వరుణుడు

బంట్వారం: వరుణ దేవుడు కరుణించడంతో శనివారం రాత్రి వాన దంచికొట్టింది. నెల రోజులుగా వర్షాలు లేక పంటలన్నీ ఎండుముఖం పట్టాయి. ఒక్క సారిగా కుండపోత వానలు రావడంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. బంట్వారం, కోట్‌పల్లి మండలాల్లోని వాగులు ,వంకలు పొంగిపొర్లుతున్నాయి. పంట పొలాలు పచ్చగా కనిపిస్తున్నాయి.


ధారూర్: వంతెనపై నుంచి పారుతున్న ప్రాజెక్టు అలుగునీరు


ధారూరు: వంతెన వద్ద నిరీక్షిస్తున్న ప్రయాణికులు


మల్‌శెట్టిపల్లి తండా వాగు దాటకుండా పోలీసుల పహారా

మృతదేహం లభ్యం

తాండూరు టౌన్: ఓ వ్యక్తి మృతదేహం లభ్యమైన ఘటన తాండూరు పోలీసు స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పట్టణ ఎస్సై అబ్దుల్ రవూఫ్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పెద్దేముల్ మండల కేంద్రానికి చెందిన బ్యాగరి చంద్రప్ప (25) హైదరాబాద్‌లో కూలీ పనులు ఉండేవాడు. ఆదివారం ఉదయం పట్టణంలోని ఆర్టీసీ బస్టాండు ఎదురుగా ఉన్న సత్యసాయి టిఫిన్ సెంటర్ ఎదుట విగత జీవిగా పడున్నాడు. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పరిశీలించి, కుటుంబసభ్యులకు మృతదేహాన్ని అప్పగించారు.

కూలిన ట్రాన్స్‌ఫార్మర్


నేలకొరిగిన ట్రాన్స్‌ఫార్మర్

తాండూరు: భారీ వర్షానికి విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్ కూలిపోయింది. మున్సిపల్ పరిధి 6వ వార్డులో చంద్ర థియేటర్ వద్ద ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ పక్కన తాగు నీటి పైపులైన్ వేసేందుకు గుంతలు తీశారు. కని, ఆదివారం కురిసిన వర్షానికి దిమ్మె కుంగి, ట్రాన్స్ ఫార్మర్ నేలకొరిగింది. దీంతో పరిసర ప్రాంత కాలనీలకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. విద్యుత్ అధికారులు మరో ట్రాన్స్‌ఫార్మర్ ద్వారా విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు. మరో రెండు రోజుల్లో దిమ్మెకు మరమ్మతు చేసి, కనెక్షన్ ఇస్తామని అధికారులు పేర్కొన్నారు.

ఆదివారం వస్తే అవస్థలే


బీజేఆర్ చౌరస్తా నుంచి బస్టాండ్ వెళ్లే రోడ్డుపై తోపుడు బండ్లు

- బీజేఆర్ చౌరస్తాలో రాకపోకలకు ఇక్కట్లు
- తీవ్ర ఇబ్బందుల్లో వాహనదారులు

వికారాబాద్ అర్బన్: వికారాబాద్‌లో ఆదివారం అంగడి నిర్వహిస్తారు. చుట్టూ పక్కల గ్రామాల ప్రజలు, పట్టణవాసులు మార్కెట్‌కు పెద్ద ఎత్తున పట్టణంలోకి వస్తారు. మిగతా రోజుల కంటే ఆదివారం పట్టణంలోని ప్రధాన రహదారుల్లో ట్రాఫిక్ సమస్య తీవ్రంగా ఉంటుంది. రోడ్డుకు రెండు వైపులు తోపుడు బండ్లు పెట్టడంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పాటుతోందని వాహనదారులు అంటున్నారు. వికారాబాద్ పట్టణం జిల్లా కేంద్రంగా ఏర్పడినప్పటి నుంచి వాహనాల సంఖ్య కూడా బాగా పెరిగింది. దీంతో ట్రాఫిక్ సమస్య కూడా పెరిగిపోయింది. ప్రధాన బీజేఆర్ చౌరస్తా నుంచి బస్టాండ్ వెళ్లే రోడ్డులో వాహనదారులు రోజు నరకం చూస్తున్నారు. బీజేఆర్ చౌరస్తా నుంచి బస్టాండ్ వైపు రోజుకు వేల వాహనాలు తిరుగుతుంటాయి. పాఠశాలలు, కళాశాలు వదిలిన సమయంలో ఈ రోడ్డు మరింత రద్దీగా ఉంటుంది. దీనికి తోడు వాహనదారులు రోడ్డు పక్కనే ఎక్కడ పడితే అక్కడ వాహనాలను పార్కింగ్ చేస్తుంటారు. బీజేఆర్ చౌరస్తా నుంచి ఎంఆర్‌పీ వరకు రోడ్డుకు రెండు వైపులా పండ్ల వ్యాపాదులు తోపుడు బండ్లను ఉంచుతున్నారు. అంటుగా పోయే వాహనదారులు ఎవరైనా తోపుడు బండ్లు రోడ్డుపై పెట్టొద్దని ప్రశ్నిస్తే వ్యాపారులు దాడులకు దిగుతున్నారు. తోపుడు బండ్లు పెట్టి ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తున్నా పోలీసులు పట్టించుకోవడం లేదని ఆరోపణలు ఉన్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి ట్రాఫిక్ సమస్యకు పరిష్కారం చూపాలని వాహనదారులు కోరుతున్నారు.

యువతి ఆత్మహత్యాయత్నం

చికిత్స పొందుతూ మృతి


అనిత (ఫైల్)

దోమ: మతిస్థిమితం లేని ఓ యువతి పురుగుల మందు సేవించి ఆత్మహత్యాయత్నానికి పాల్పడి, చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటన దోమ ఠాణా పరిధిలో ఆదివారం చోటుచేసుకుంది. ఎస్‌ఐ రవిగౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. దోమ మండలం దాదాపూర్ గ్రామానికి చెందిన బాపురం గొరేప్ప, ఈశ్వరమ్మ దంపతులకు నలుగురు సంతానం. ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు. అందులో పెద్ద కుమార్తె అనితకు నంజు వ్యాధితో పాటు మతిస్థిమితం సరిగా ఉండదు. అయితే ఎప్పటిలాగే ఇంట్లో ఉంటున్న అనిత(20) శనివారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగు మందును సేవించింది. ఇది గమనించిన కుటుంబీకులు ఆమెను నారాయణపేట జిల్లా కోస్గిలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో మహబూబ్‌నగర్‌లోని ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ ఆమె ఆదివారం మృతి చెందింది. మృతురాలి తల్లి ఈశ్వరమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఎక్స్‌ప్రెస్‌వేపై రోడ్డు ప్రమాదం

యువకుడి దుర్మరణం
- మరొకరికి తీవ్ర గాయాలు

రాజేంద్రనగర్: పీవీ నర్సింహారావు ఎక్స్‌ప్రెస్‌వేపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందగా మరో యువకుడికి తీవ్రంగా గాయాలు అయిన ఘటన ఆదివారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం వివరాలిలా.. రాంనగర్ గుండు ప్రాంతానికి చెందిన పి.శివ(25) డీజే ఆపరేటర్‌గా పని చేస్తున్నాడు. తన స్నేహితుడు మహేష్ (33)తో కలిసి బైక్‌పై శంషాబాద్ ప్రాంతానికి వచ్చి ఆదివారం ఉదయం నగరానికి బయలు దేరాడు. పీవీ నర్సింహారావు ఎక్స్‌ప్రెస్‌వే పైనుంచి వెళ్లేందుకు బైక్‌లకు అనుమతి లేకపోయినా నిబంధనలకు విరుద్ధంగా వారిద్దరూ ఎక్స్‌ప్రెస్‌వేపై మీదుగా వెళ్తుండగా పిల్లర్ 215 వద్ద గుర్తుతెలియని కారు వీరి బైక్‌ను ఢీ కొట్టింది. ఈ ఘటనలో ఎగిరి కిందపడటంతో తలకు తీవ్ర గాయాలవడంతో శివ అక్కడికక్కడే మృతి చెందాడు. తీవ్రంగా గాయపడిన మహేష్‌ను వాహనదారులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు అంబులెన్స్‌లో స్థానిక ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. కాగా, గత నాలుగు నెలలుగా ఎక్స్‌ప్రెస్‌వేపై ప్రమాదాల పరంపర కొనసాగుతోంది. త్వరగా వెళ్లాలన్న ఆలోచనతో కొందరు వ్యక్తులు ద్విచక్ర వాహనాలకు ఎక్స్‌ప్రెస్‌వేపై అనుమతి లేకపోయినా ఈ మార్గంలో ప్రయాణిస్తూ ప్రమాదాల బారిన పడుతున్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ఇబ్రహీంపట్నం రూరల్: పని చేయడం లేదని తల్లిదండ్రులు మందలించడంతో మూడు నెలల క్రితం ఇంటి నుంచి పారిపోయిన యువకుడు రోడ్డు ప్రమాదంలో దుర్మరణం చెందాడు. ఈ ఘటన శనివారం అర్ధరాత్రి ఆదిబట్ల పీఎస్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ శ్రీనివాస్‌రావు తెలిపిన ప్రకారం.. మహబూబ్‌నగర్ జిల్లా మూసాపేట్ మండలం, జానంపేట్ గ్రామానికి చెందిన పల్లి శివకుమార్(21) ఇంటర్ చదివి ఇంటి వద్దే ఉంటున్నాడు. తల్లిదండ్రులు మందలించడంతో ఇంట్లోంచి వెళ్లిపోయాడు. ఈ క్రమంలో శనివారం రాత్రి కర్నూల్ జిల్లా డోన్ నుంచి కరీంనగర్‌కు టమాటా లోడ్‌తో వెళ్తున్న బొలెరో వాహనం వెళ్తుంది. మార్గమధ్యంలో పంచలింగాల సమీపంలో శివకుమార్ లిఫ్ట్ అడిగి వాహనం ఎక్కాడు. అర్ధరాత్రి 12గంటల సమయంలో బొంగ్లూరు జంక్షన్ వద్ద ఎగ్జిట్ నంబర్–12 వద్ద వాహనం అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టడంతో వాహనం బోల్తాపడింది. ఈ ప్రమాదంలో డ్రైవర్ సుధాకర్‌కు స్వల్ప గాయాలవ్వగా శివకుమార్ తలకు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి వద్ద లభించిన ఆధారాలతో తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చారు. శవాన్ని ఇబ్రహీంపట్నం మార్చురీలో భద్రపరిచారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కోస్గి డిపోలో బస్సులు కరువు

పదకొండు బస్సులతో నిర్వహణ
- అందులో ఒకటే ఎక్స్‌ప్రెస్
- ఎప్పుడు ఎక్కడ ఆగుతాయో తెలియని పరిస్థితి


విస్తరణకు నోచుకోని కొడంగల్ బస్టాండ్


సౌకర్యాలు లేని కోస్గి బస్సు డిపో

కొడంగల్ : నియోజకవర్గ పరిధిలోని కోస్గి ఆర్టీసీ డిపోలో బస్సులు కరువయ్యాయి. కాలం చెల్లిన 11 బస్సులు డిపోలో ఉన్నాయి. వీటితోనే కొన్ని రూట్లలో పల్లె వెలుగు బస్సులు నడుపుతున్నారు. ఒక్క బస్సు మాత్రమే ఎక్స్‌ప్రెస్. ఇది హైదరాబాద్ కోస్గి రూట్‌లో నడుస్తోంది. ఈ బస్సులు ఎప్పుడు ఎక్కడా ఆగుతాయో తెలియని పరిస్థితి నెలకొంది. డిపో నిర్వహణపై ప్రయాణికుల నుంచి విమర్శలు వస్తున్నాయి.

జూన్ 4న డిపో ప్రారంభం

ఎన్నో ఏళ్ల జాప్యం తర్వాత రాష్ట్ర మంత్రి కేటీఆర్ చేతుల మీదుగా గత ఏడాది జూన్ 4వ తేదిన కోస్గిలో ఆర్టీసీ డిపోను ప్రారంభించారు. కేవలం పదకొండు బస్సులతో కోస్గి బస్సు డిపో నిర్వహణ కొనసాగుతోంది. దీంతో నియోజకవర్గ ప్రజలకు రవాణా సేవలు అందడం లేదు. కోస్గి బస్సు డిపో ప్రారంభమైతే నియోజకవర్గంలోని అన్ని గ్రామాలకు బస్సులు తిరుగుతాయని ప్రజలు ఆశించారు. డిపో ప్రారంభించి ఏడాది దాటినా ప్రయాణికులకు మెరుగైన సేవలు అందడం లేదనే ఆరోపణ ఉంది. పల్లెకు బస్సులు రావడం లేదని విద్యార్థులు ఆటోలు, జీపుల్లో ప్రయాణిస్తున్నారు. ప్రస్తుతం ఉన్న 11 బస్సులతో రోజుకు లక్ష రూపాయలకు పైగా ఆదాయం వస్తున్నట్లు ఆర్టీసీ అధికారులు చెబుతున్నారు. బస్సులు పెంచితే మరింత ఆదాయం వచ్చే అవకాశం ఉందంటున్నారు. ఈ విషయంపై ఆర్టీసీ అధికారులను వివరణ కోరగా త్వరలో కొత్త బస్సులు వస్తాయని తెలిపారు. అద్దె బస్సుల కోసం ప్రయత్నిస్తున్నట్లు చెప్పారు. కొత్త బస్సులు వచ్చిన తర్వాత రవాణా సౌకర్యం మెరుగుపడుతుందని అధికారులు తెలిపారు. ఇప్పటికీ కోస్గి డిపోకు మేనేజర్‌ను నియమించలేదు. డిపోలో కనీస మౌలిక సదుపాయాలు లేవు. బస్సులను శుభ్రం చేసే స్టాండ్‌ను ఏర్పాటు చేయాల్సి ఉంది. పూర్తి స్థాయిలో మెకానిక్‌లను నియమించలేదు. సిబ్బంది సైతం నామమాత్రంగానే ఉన్నారు.

విస్తరణకు నోచుకోని కొడంగల్ బస్టాండ్

తెలంగాణ – కర్నాటక రాష్ట్ర సరిహద్దులో రెండు జాతీయ రహదారులను కలిపే కొడంగల్ బస్టాండ్‌పై అధికారులు చిన్న చూపు చూస్తున్నారు. కొడంగల్ నుంచి నిత్యం వేల మంది ప్రయాణికులు రాకపోకలు సాగిస్తున్నారు. ఒకేసారి ఐదారు బస్సులు వస్తే ట్రాఫిక్ జామవుతోంది. కొడంగల్ బస్టాండ్‌కు 24.10.1979న అప్పటి రవాణాశాఖ మంత్రి వెంగల్‌రావు శంకుస్థాపన చేశారు. ప్లాట్‌ఫారాలు నిర్మించిన తర్వాత తేది 19.12.1981న అప్పటి ముఖ్యమంత్రి అంజయ్య, రవాణాశాఖ మంత్రి రోశయ్య బస్టాండ్‌ను ప్రారంభించారు. నాటి నుంచి నేటి వరకు బస్టాండ్ విస్తరించలేదు. నాటికి నేటికీ ప్రయాణీకుల సంఖ్య భారీగా పెరిగింది. నియోజకవర్గ కేంద్రమైన కొడంగల్ నుంచి వికారాబాద్ జిల్లా కేంద్రానికి బస్సు సౌకర్యం లేదు. 2017న అప్పటి రవాణా శాఖ మంత్రి మహేందర్‌రెడ్డి కొడంగల్ నుంచి జిల్లా కేంద్రానికి పల్లె వెలుగు బస్సును ప్రారంభించారు. వారం రోజులు తిరగక ముందే బస్సును అధికారులు రద్దు చేశారు. ఈ ప్రాంత ప్రజలు పలుమార్లు ఫిర్యాదు చేసినా ఆర్టీసీ అధికారులు స్పందించలేదు. వికారాబాద్ జిల్లా కేంద్రానికి వెళ్లాలంటే రెండు బస్సులు ఎక్కి దిగాల్సి వస్తోంది. పరిగి నుంచి వెళితే 52 కిలోమీటర్లు, తాండూరు నుంచి వెళితే 68 కిలోమీటర్ల దూరం అవుతోంది.

వీధి కుక్కల దాడి

మృత్యువాత పడిన మూడు లేగదూడలు

కేశంపేట: వీధి కుక్కలు దాడి చేయడంతో మూడు లేగదూడలు మృత్యువాత పడ్డాయి. ఈ ఘటన మండల పరిధిలోని పాపిరెడ్డిగూడలో ఆదివారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన ప్రకారం.. గ్రామానికి చెందిన అబ్బి రవికుమార్ పాల వ్యాపారంతో జీవనం సాగిస్తున్నారు. రోజు మాదిరిగానే లేగదూడలను పొలం వద్ద ఉంచారు. ఆదివారం ఉదయం కుక్కలు పశువులకు ఏర్పాటు చేసిన కంచె దాటుకుని వెళ్లి లేగదూడలపై దాడి చేసి చంపేశాయని తెలిపారు. ప్రభుత్వం స్పందించి రైతును ఆదుకోవాలని కోరారు.

ఆలయ పుష్కరిణిలో మృతదేహం లభ్యం


గుర్తుతెలియని మృతదేహం

చేవెళ్ల: మండల కేంద్రంలోని లక్ష్మీవేంకటేశ్వర స్వామి ఆలయ పుష్కరిణిలో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. ఈ ఘటన ఆదివారం మధ్యాహ్నం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం.. ఆలయ పుష్కరిణిలో మృతదేహం తేలియాడుతూ కనిపించడంతో స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని శవాన్ని బయటకు తీశారు. మృతుడి ఒంటిపై దుస్తులు లేకపోవడం.. గట్టుపైన బట్టలు లభించకపోవడంతో మృతిపై అనుమానాలున్నాయన్నారు. మృతుడి వయస్సు 40–50 ఏళ్ల మధ్య ఉంటుందని ..ఆధారాలు లభిస్తే కేసులో పురోగతి ఉంటుందని తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చేవెళ్ల ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతుడి వివరాలు తెలిసిన వారు పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. కేసు దర్యాప్తులో ఉంది.

వంద రోజులు కష్టపడితే అధికారం

పీసీసీ ప్రచార కమిటీ కార్యనిర్వాహక సభ్యుడు భీంభరత్


భీంభరత్‌ను సన్మానిస్తున్న యువత

షాబాద్: పార్టీ శ్రేణులు వంద రోజులు ఐక్యంగా కష్టపడితే కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని పీసీసీ ప్రచార కమిటీ కార్యనిర్వాహక సభ్యుడు పామెన భీంభరత్ అన్నారు. ఆదివారం మండల పరిధిలోని మద్దూర్ గ్రామం ఆయన్ను పలువురు నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. త్వరలోనే కాంగ్రెస్ పార్టీలో చేరుతామన్నారు. ఈ సందర్భంగా భీంభరత్ మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ తొమ్మిదేళ్లుగా ప్రజలను మోసం చేస్తున్నారని.. ఎప్పుడు ఎన్నికలు వచ్చినా అధికారంలోకి వచ్చేది కాంగ్రెస్ పార్టీయేనన్నారు. సర్వేల ఆధారంగానే పార్టీ అధిష్టానం టికెట్ కేటాయిస్తుందని చెప్పారు. అధిష్టానం ఎంపిక చేసిన అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా పార్టీ శ్రేణులు పనిచేయాలని సూచించారు. కార్యకర్తలు నిరంతరం ప్రజల్లోనే ఉండాలని చెప్పారు. వందరోజులు తాము నియోజకవర్గాల పరిధిలోనే పర్యటిస్తామని, క్షేత్రస్థాయిలో పార్టీ పరిస్థితులను ఎప్పటికప్పుడు పరిశీలిస్తామన్నారు.

అభివృద్ధి పనులకు ప్రత్యేక నిధులు

తలకొండపల్లి: గ్రామాల అభివృద్ధికి ప్రత్యేక నిధులు అందజేసి సమస్యలు పరిష్కరిస్తామని కల్వకుర్తి ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ అన్నారు. మండల పరిధిలోని వెంకట్‌రావు పేట గ్రామస్తులు ఆదివారం నగరంలోని ఎమ్మెల్యే నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామ పంచాయతీ కార్యాలయం శిథిలావస్థకు చేరిందని.. నూతన భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కోరారు. ఇందుకు స్పందించిన ఎమ్మెల్యే పంచాయతీ భవన నిర్మాణానికి రూ.20లక్షల నిధులకు సంబంధించిన ప్రొసీడింగ్స్‌ను గ్రామ ప్రజాప్రతినిధులకు అందజేశారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో ఎంపీటీసీ సభ్యురాలు సరిత, గణేశ్‌గుప్తా, సర్పంచ్‌లు హైమావతి, రమేశ్, లింగమ్మ, దశరథ్‌నాయక్, ఈశ్వర్‌నాయక్ తదితరులున్నారు.


ప్రొసీడింగ్స్ అందజేస్తున్న ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్